సాక్షి వికారాబాద్

శుక్రవారం । 30 । జూన్ । 2023



దడపుట్టిస్తున్న ధరలు

కూరగాయల ధరలు వినియోగదారులకు దడపుట్టిస్తున్నాయి. మిర్చి, టమాటా సామాన్యులు తినే పరిస్థితి లేదు. 8లో▸



మేము సైతం..

సమాజసేవలో మేము సైతం అంటూ యువ 24 ఫౌండేషన్ సభ్యులు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 8లో▸



అద్దె భవనాలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయి. కొన్ని ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. 9లో▸



తాండూరు టౌన్: ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బక్రీద్ ముబారక్

త్యాగానికి ప్రతీకగా చెప్పుకొనే బక్రీద్ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అలయ్‌బలయ్ తీసుకుని ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. మౌలాలు, మత పెద్దలు అల్లా సందేశాన్ని వినిపించారు. చెడును త్యజించడమే బక్రీద్ పరమార్థమన్నారు. ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలని, ఎదుటివారి కష్టాల్లో పాలు పంచుకోవాలని సూచించారు.



అనంతగిరి: వికారాబాద్‌లో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే ఆనంద్



అనంతగిరి: చిన్నారుల అలయ్‌బలయ్

న్యూస్‌రీల్

గ్రూప్ -4 పరీక్షకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ



అనంతగిరి: జిల్లాలో శనివారం నిర్వహించనున్న గ్రూప్- 4 సెంటర్ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ కోటిరెడ్డి ప్రకటనలో తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల వద్ద జనాలు గుమికూడదని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశించారు.అభ్యర్థులు, సిబ్బంది, అధికారులు మినహా మిగిలిన వారికి అనుమతి లేదన్నారు. మొత్తం 67 కేంద్రాల్లో 18,118 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు. 190 మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులకు ఏ అవసరం ఉన్నా వెంటనే పోలీసులకు గాని 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఎగ్జామ్ సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. అభ్యర్థులందరూ పరీక్ష నిబంధనలు పాటించాలన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా భీంసేన్



భీంసేన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి బుచ్చిరెడ్డి

దోమ: స్థానిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా భీంసేన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బుచ్చిరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం పది మంది డైరెక్టర్లు విజయం సాధించగా.. అందులో అధికార పార్టీకి ఆరుగురు సభ్యులు భీంసేన్‌కు మద్దతు తెలిపారు. మరో వ్యక్తి పోటీలో లేకపోవడంతో నూతన చైర్మన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ నేతలు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషిచేయాలని సర్పంచ్ రాజిరెడ్డి కొత్త చైర్మన్‌కు సూచించారు.

ఎమ్మెల్యే సన్మానం

స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పట్టణంలోని తన నివాసంలో భీంసేన్‌ను సన్మానించారు. పాడి రైతులు లాభాల బాటలో పయనించేందుకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, మాజీ చైర్మన్ గొల్ల శ్రీను, డైరెక్టర్లు తెలుగు హన్మంతు, గొల్ల పెంటయ్య, గొల్ల అంజిలమ్మ, వార్ల లలిత, కావలి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

శర'వే'గంగా విస్తరణ

అబ్దుల్లాపూర్‌మెట్: విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు మోక్షం కలిగింది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా విస్తరణ చేపట్టాలంటూ వస్తున్న ప్రతిపాదనలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు పచ్చజెండా ఊపడంతో కొన్ని రోజులుగా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు 24 కిలోమీటర్ల మేర ఇరువైపులా మూడు లేన్ల చొప్పున రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రూ.600కోట్లు మంజూరయ్యాయి. కోవిడ్, కాంట్రాక్టర్ల సమస్యతో జాప్యం జరుగుతూ వస్తున్న పనులు ప్రస్తుతం నిర్విరామంగా కొనసాగుతున్నాయి. రహదారి విస్తరణ పూర్తయితే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని భావిస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి మినహా ప్రస్తుతం హయత్‌నగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి.



కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

436 మందికి.. 552 ఎకరాలు

నేడు 'పోడు' పట్టాల పంపిణీ

- మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేల చేతుల మీదుగా పాసు పుస్తకాలు
- ఏడాదిన్నర ఎదురు చూపులకు తెర
- హర్షం వ్యక్తంచేస్తున్న లబ్ధిదారులు

వికారాబాద్: ఏడాది కాలంగా వాయిదా పడుతూ వచ్చిన 'పోడు' పట్టాల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గిరిజన దినోత్సవం రోజున అర్హులకు పట్టాలు అందజేస్తామని ప్రకటించినప్పటికీ తిరిగి జూన్ 30కి వాయిదా వేశారు. పోడు భూముల అర్హులెవరు..? జిల్లాలో ఎంతమంది ఉన్నారు..? అనే లెక్క తేలగా.. గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా, వీరికి అందజేసేందుకు పాసు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. ఇరవై నెలల క్రితం ప్రభుత్వం పోడు భూములకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం ఏడాదిన్నరగా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. అటవీ సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆరు నెలలుగా దరఖాస్తుల పరిశీలన నిర్వహించారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో శుక్రవారం పట్టాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారులకు పాసు పుస్తకాలు ఇవ్వనున్నారు.

అటవీ నిబంధనల మేరకు..

పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఆ దిశగా కసరత్తు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే జిల్లాలోని ఫారెస్ట్ భూములతో సంబంధం కలిగి ఉన్న 126 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 133 గ్రామాల్లో అటవీ సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. అయితే అధికారులు ఊహించని విధంగా 21,761 ఎకరాల్లో కబ్జాలో ఉన్నట్లు 9,647 మంది రైతులు పోడు హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అటవీ సంరక్షణ చట్టంలో పొందుపర్చిన నిబంధన ప్రకారం కేవలం ఐదు శాతంలోపు దరఖాస్తులకే ఆమోదం లభించింది. 2005 కన్నా ముందు నుంచే అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు.



జిల్లాలో గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూమి

ఏర్పాట్లు పూర్తి

పోడు హక్కులు కల్పించే ప్రక్రియలో అటవీ ప్రాంతం కుంచించుకుపోకుండా ఉండేందుకు ఆ శాఖ అధికారులు నానా తంటాలు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 9,647 దరఖాస్తులు రాగా 436 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. వీరికి 552 ఎకరాల భూమిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో పది మండలాలకు సంబంధించి లబ్ధిదారులు ఉండగా కుల్కచర్ల మండలంలో అత్యధికంగా 187 మంది, పరిగిలో 77 మంది అర్హులు ఉన్నారు. అత్యల్పంగా పూడూరు, కొడంగల్‌లో ఆరుగురు, బషీరాబాద్‌లో ఏడుగురు అర్హులు ఉన్నారు. వీరికి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పట్టాలు అందించనున్నారు. ఏడాదిన్నర ఎదురు చూపులకు తెర పడనున్న నేపథ్యంలో లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కలెక్టరేట్‌లో పట్టాల పంపిణీ



జిల్లాలోని 436 మంది లబ్ధిదారులకు శుక్రవారం పోడు పట్టాలు అందజేస్తాం. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులకు స్పష్టమైన సూచనలు చేశాం. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంత్రి సబితారెడ్డి చేతులమీదుగా రైతులకు పట్టాలు పంపిణీ చేస్తాం. లబ్ధిదారులు సకాలంలో చేరుకోవాలి. పట్టాలు రాని వారు నిరాశ చెందకూడదు.

– నారాయణరెడ్డి, కలెక్టర్

మాఫీ ఎప్పుడైతదో?

- నాలుగేళ్లుగా అమలు కాని పంట రుణ మాఫీ
- కొత్త రుణాలు మంజూరు చేయని బ్యాంకర్లు
- ఆందోళనలో రైతులు

కొడంగల్: గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన పంట రుణ మాఫీ హామీ అమలుకు నోచుకోవడం లేదు. రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని 2018 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రచారం చేశారు. కానీ నాలుగేళ్లు దాటినా కార్యరూపం దాల్చలేదు. ఏళ్ల తరబడి ఎదురు చూసినా రుణమాఫీ ఇప్పట్లో జరిగే అవకాశం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు రూ.25 వేలలోపు రుణాలను కూడా పూర్తి స్థాయిలో మాఫీ చేయలేదు. వానాకాలం సీజన్ ప్రారంభమైంది. వేసవి దుక్కులు దున్నుకొని రైతులు విత్తనాలు వేస్తున్నారు. పాత పంట రుణాలు మాఫీ కాక కొత్త రుణాలు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నారు. రుణాలు రెన్యూవల్ కాని వారు డిఫాల్టర్లుగా మిగిలి పోతున్నారు. అప్పులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా మాఫీ మాత్రం అమలు కావడం లేదు.

నాలుగేళ్లుగా ఎదురు చూపులు

రాష్ట్ర వ్యాప్తంగా 2018 డిసెంబర్ 11 నాటికి ఉన్న పంట రుణాలను రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని 2020 మార్చిలో ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా రూ.25 వేలలోపు క్రాప్ లోన్లు తీసుకున్న వారిలో కొద్ది మందికి మాత్రమే మాఫీ వర్తించింది. మిగిలిన వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. మొదటి దశలో రూ.25 వేలు, రెండో దశలో రూ.50 వేలు, మూడో దశలో రూ.75 వేలు, నాలుగో దశలో లక్షలోపు రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు మొదటి దశ కూడా పూర్తి కాలేదని రైతులు పేర్కొంటున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని ప్రాథమిక సహకార సంఘాలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీబీ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, మండల కేంద్రాల్లోని ఇతర బ్యాంకుల్లో వేలాది మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు దశల రుణమాఫీ వెంటనే చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.



వరి నాట్లు వేస్తున్న కూలీలు

స్విమ్మింగ్ పూల్‌లో విద్యార్థి మృతి

మొయినాబాద్: తోటి విద్యార్థులతో కలిసి గెట్ టు గెదర్ పార్టీ జరుపుకొనేందుకు ఫాంహౌస్‌కు వచ్చిన విద్యార్థి స్విమ్మింగ్ పూల్‌లో స్పృహతప్పి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన మండల పరిధిలోని సురంగల్ రెవెన్యూలో ఉన్న ఓ ఫాంహౌస్‌లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని శ్రీదత్త ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ 4వ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు 18 మంది బుధవారం రాత్రి సురంగల్ రెవెన్యూలో ఉన్న ఓ ఫాంహౌస్‌లో గెట్ టు గెదర్ పార్టీ జరుపుకొన్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యార్థులు స్విమ్మింగ్ చేస్తుండగా సరూర్‌నగర్ మండలం బాలాపూర్‌కు చెందిన చిట్టి ఆనంద్ (21) స్విమ్మింగ్ పూల్‌లోనే స్పృహకోల్పోయాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆనంద్ మృతి చెందినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంలో గుర్రంగూడ

- సాయిచంద్ మృతితో విషాదం
- పార్థివ దేహాన్ని కడసారి చూసేందుకు బారులు తీరిన నేతలు
- అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర
- సాహెబ్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు



నివాళి అర్పిస్తున్న మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

బడంగ్‌పేట్: తన గళంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన పాలమూరు ముద్దుబిడ్డ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అకాల మరణం యావత్ తెలంగాణ సమాజాన్ని శోక సంద్రంలో ముంచేసింది. మరణవార్త తెలుసుకున్న వెంటనే బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని గుర్రంగూడకు ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, తెలంగాణ కవులు, కళాకారులు, తోటి సహచరులు ఆయన ఇంటికి చేరుకుని పార్థివదేహానికి నివాళి అర్పించారు. తన గొంతుకతో తెలంగాణ సమాజాన్ని ఒక్కటి చేసిన సాయిచంద్‌ను కోల్పోవడం బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. పార్టీలకు అతీతంగా కడసారి చూసేందుకు ప్రజాప్రతినిధులు, కవులు, కళాకారులు, రచయితలు, అభిమానులు బారులు తీరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గుర్రంగూడ నుంచి సాహెబ్‌నగర్ శ్మశానవాటిక వరకు అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర కొనసాగింది. అరుణోదయ కళాకారిణి విమలక్క, ప్రజా యుద్ధనౌక గద్దర్, గోరటి వెంకన్న, మధుప్రియ, రసమయి బాలకిషన్, మంగ్లీ తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

'లక్ష'ణంగా అర్హుల ఎంపిక



వికారాబాద్ మున్సిపల్ పరిధిలో అర్హుల వివరాలను సేకరిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

- పకడ్బందీగా కులవృత్తిదారుల గుర్తింపు
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- రెండు రోజుల్లో అర్హుల జాబితా వెల్లడించే అవకాశం

వికారాబాద్ అర్బన్: కుల వృత్తుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయల ఆర్థిక సాయానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా సాగుతోంది. అర్హులను మాత్రమే ఎంపిక చేయాలనే ఆదేశాలు ఉండటంతో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కులవృత్తులదారుల నుంచి 11వేల దరఖాస్తులు వచ్చాయి. మండలాల వారీగా అధికారులు వీటిని చేతిలో పట్టుకుని నేరుగా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి, వారి ఆర్థిక పరిస్థితి, ప్రస్తుతం చేస్తున్న వృత్తి తదితర వివరాలను తెలుసుకుంటున్నారు. గురువారం సాయంత్రానికి అర్హులను గుర్తించాలనే నేపథ్యంలో ప్రక్రియను వేగవంతం చేశారు. పద్దెనిమిదేళ్లు నిండిన వారు కూడా ఈ పథకానికి అర్హులని చెప్పడంతో ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. వీరిలో 18నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ సంక్షేమ శాఖల నుంచి రూ.50 వేల లబ్ధి పొందిన వారు అనర్హులని పేర్కొంటున్నారు. అయితే కార్పొరేషన్ల ద్వారా లబ్ధి పొందిన వారి సంఖ్య తక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్హుల జాబితా పూర్తిస్థాయిలో సిద్ధమయ్యేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశముంది. క్షేత్రస్థాయి పరిశీలన కోసం అధికారులు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లగా కొంతమంది అందుబాటులో లేకపోవడంతో ప్రక్రియ ఆలస్యమవుతోందని సమాచారం. ఇదే సమయంలో ఆర్థికంగా బాగా స్థిరపడ్డ కులవృత్తుల వారు కూడా లక్ష సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- కిటకిటలాడిన ఆలయాలు
- స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు

వికారాబాద్ అర్బన్/అనంతగిరి: ఆషాఢమాస ఏకాదశిని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతగిరిలోని పద్మనాభస్వామి ఆలయానికి జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు వీరికి తీర్థప్రసాదాలు అందజేశారు.

రామ మందిరంలో గీతా పారాయణం

ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని రామమందిరంలో గీతా పారాయణం నిర్వహించారు. రుక్మిణీ సహిత విఠలేశ్వరుడికి మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు మంజులరమేశ్ అభిషేకం, అర్చన నిర్వహించారు. గీతా వాహిని ఆధ్వర్యంలో ఆరేళ్లుగా ఏటా తొమ్మిది రోజుల పాటు నిత్యం రెండు అధ్యాయాల చొప్పున సంపూర్ణ రామాయణ పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతా వాహిని పట్టణ అధ్యక్షురాలు, కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ మోముల స్వాతి, గీతా వాహిని ఉపాధ్యక్షురాలు మోనిగారి లావణ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు



రామ మందిరంలో గీతా పారాయణం చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

రేపు శనిత్రయోదశి



ఏన్కతలలో కొలువైన శనైశ్వరస్వామి

మోమిన్‌పేట: శనివారం శని త్రయోదశి సందర్భంగా శనైశ్చర స్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. మండల పరిధిలోని ఏన్కతలలో వెలసిన శనైశ్చరస్వామిని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. స్వామి వారికి నల్లని దుస్తులు, నువ్వుల నూనె అత్యంత ప్రీతిపాత్రమైనవి కావడంతో శనిత్రయోదశి రోజు వాటితో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల నమ్మకం. భక్తులు సప్త వృక్షాల చుట్టూ ప్రదక్షిణలు చేసుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: మండల పరిధిలోని పీరంపల్లికి చెందిన పోలెపల్లి నర్సయ్య అనే వ్యక్తి ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి, టీడీపీ జాతీయకార్యవర్గసభ్యుడు కాసాని వీరేశ్‌లు స్థానిక నేతల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా అందించారు. నియోజకవర్గ ప్రజలందరికీ అండగా ఉంటామని వివిధ ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, బాలముకుందం, శ్రీను, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ధారూరు: తీసుకున్న డబ్బు చెల్లించాలని అడిగితే ఇవ్వకపోగా అవమానపరచడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం ధారూరు మండలం రుద్రారం గ్రామ సమీప అడవిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం రేగొండి గ్రామానికి చెందిన నీరటి రాములు రెండో కుమారుడు మల్లేశ్(28)కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. రెండో కాన్పు తర్వాత రుద్రారంలోని అత్తింట్లో భార్య శ్రీలతతోపాటు ఉంటున్నారు. మల్లేశ్ బుధవారం ఉదయం తల్లి అమృతమ్మకు ఫోన్ చేసి నాలుగేళ్ల క్రితం రుద్రారం గ్రామానికి చెందిన చంద్రప్పకు రూ.5 లక్షలు, లస్మప్పకు రూ.10 వేలు, పాండుకు రూ.20 వేల అప్పు ఇచ్చానని తెలిపాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, అవమానించి కొట్టారని వాపోయాడు. నాకు ఆత్మహత్యే శరణ్యమంటూ చెప్పి ఫోన్ కట్‌చేశాడు. తల్లి తిరిగి కాల్‌చేసినా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో వారు రుద్రారం వచ్చి అంతటా వెతికారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని కన్పించాడు. ఈ మేరకు తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ చెప్పారు.

చాతుర్మాస యజ్ఞం ప్రారంభం

కేశంపేట: తొలి ఏకదశిని పురస్కరించుకొని మండలంలోని శివ సీతారామాంజనేయ ఆలయంలో గురువారం చాతుర్మాస యజ్ఞం నిర్వహించారు. ఈ యజ్ఞం కార్తీక శుద్ధ ద్వాదశి వరకు సుమారుగా 5నెలల పాటు నిర్వహిస్తామని సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తలసాని పద్మ, రాఘవశర్మ, విజయరెడ్డి, నర్సింహచారి, మల్లారెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనసూయ, రామకృష్ణచారి పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న ధరలు

కూరగాయలు కొనలేం
- కొనకముందే టమాటా కుతకుత
- సామాన్యులకు తప్పని ఇబ్బందులు



రైతు బజారులో కూరగాయల విక్రయాలు

వికారాబాద్ అర్బన్: ప్రతి ఏటా జూన్ మొదటి వారం నుంచే కూరగాయల ధరలు అధికంగా ఉంటాయి. ఈ ఏడాది కొంత ఆలస్యంగా ధరలు ఆకాశానంటాయి. పది రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి పోయాయి. దీనికంతటికి కారణం కూరగాయల దిగుబడి అంతగా లేకపోవడమేనని వ్యాపారులు అంటున్నారు. ప్రధానంగా మార్కెట్‌లో పచ్చిమిర్చి కొనుగోలు దారులకు మరింత ఘాటును చూపిస్తుండగా, టమాటా ధరలతో ఎరుపెక్కి పోయింది.

జిల్లాలో సాగు తక్కువే..

జిల్లాలో కూరగాయల సాగు పెద్దగా లేకపోవడంతో దళారులు ధరలు పెంచేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా బోరు బావుల ద్వారానే సాగుచేస్తున్నారు. ప్రధానంగా నవాబుపేట, పూడూరు, వికారాబాద్, మోమిన్ పేట, మర్పల్లి, పరిగి వంటి కొన్ని మండలాల్లోనే కూరగాయల సాగు అధికంగా ఉంటోంది. ప్రధానంగా టమాటా, వంకాయ, బెండ, బీర, దొండ, చిక్కుడు, ఉల్లి, పచ్చిమిర్చి, క్యాబేజ్, క్యాలీఫ్లవర్ వంటి పంటలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఆకుకూరలు పండిస్తున్నారు. నవాబుపేట, వికారాబాద్, పూడూరు వంటి మండలాల రైతులు అత్యధికంగా హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. చిన్నపాటి రైతులు పండించే కూరగాయలు మాత్రమే స్థానిక మార్కెట్లకు వస్తుండటంతో కొరత ఏర్పడి ధరలు మండి పోతున్నాయని కూడా చెప్పవచ్చు.

ఇతర ప్రాంతాల నుంచి..

కూరగాయల దిగుబడి లేకపోవడంతో కమీషన్ ఏజెంట్లు ఇతర ప్రంతాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేస్తున్నారు. ప్రధానంగా ఏపీలోని కర్నూలు, అనంతపురంతో పాటు, హైదరాబాద్ నుంచి తీసుకొస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుండి కొంత కూరగాయలు వచ్చినా డిమాండ్‌కు తగ్గ సరిపోవడం లేదు. కమీషన్ ఏజెంట్ల వద్ద వ్యాపారులు ధర ఎక్కువ వెచ్చించి కొనుగోలు చేసి రైతు బజారులో రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు. బీర్నిస్, క్యాప్సికం వంటి కూరగాయాలు కిలో రూ. 80కి పైగానే పలుకుతున్నాయి. ప్రస్తుతం శుభకార్యాలు కూడా పెద్దగా లేక పోయినా ధరలు పెరగడంతో సామాన్యులు నివ్వెర పోతున్నారు.

వికారాబాద్ మార్కెట్‌లో ధరలు.. (రూ.లలో)

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటా	90	కాలీఫ్లవర్	60
పచ్చిమిర్చి	120	క్యాబేజీ	30
వంకాయ	60	ఆలుగడ్డ	40
క్యాప్సికమ్	80	క్యారెట్	60
దొండ	60	బీర్నిస్	80
బెండ	60	కాకర కాయ	60

‘రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా..’

సాయిచంద్ యాదిలో జిల్లా ప్రజలు

అనంతగిరి: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో జిల్లా ఉద్యమనాయకులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి నిన్నటి వరకు సాయి చంద్‌తో జిల్లా అనుబంధం పెనవేసుకొని ఉంది. ‘రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా.. రక్తబంధం విలువ నీకు తెలియదురా’.. అంటూ ఆయన గొంతు నుంచి వచ్చిన ఆ పాట ఇప్పటికీ తెలంగాణ లోకాన్ని భావోద్వేగానికి గురిచేస్తోంది. ఉద్యమంలో గజ్జె కట్టి పాడిన పాటలు ఈ ప్రాంతంలో ఎంతో మందిలో ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. సాయిచంద్ వికారాబాద్‌లో వచ్చిన ప్రతిసారి అందరిలో కలియ తిరిగేవారు. ఉద్యమంలో భాగంగా వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో జరిగిన హైదరాబాద్ హమారా కార్యక్రమంలో ఆయన పాల్గొని తన గొంతుకతో ఆకట్టుకున్నారు. దాంతో పాటు తాండూరులో జరిగిన విద్యార్థి రణభేరి, చేవెళ్లలో జరిగిన విద్యార్థి శంఖరావం, ప్రత్యేక రాష్ట్రం వచ్చాక వీడీడీఎఫ్ ఆధ్వర్యంలో బ్లాక్ గ్రౌండ్‌లో జరిపిన సమావేశంలో, కొకుంట్లలో జరిగిన ఉద్యమ కార్యక్రమం తదితర అనేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని తన పాటలతో ఉద్యమ స్ఫూర్తిని నింపారు. ఇటీవల సీఎం కేసీఆర్ వికారాబాద్ పర్యటనలో సైతం సాయిచంద్ విచ్చేసి పాటలతో ప్రజలతో మమేకమయ్యారు. వికారాబాద్ ప్రాంతంలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో పాటు పలువురు ఉద్యమ నాయకులతో ఆయనకు సాన్నిహిత్యం ఉండేది. ఈ ప్రాంత ప్రజలు, ఉద్యమ కారులు సాయిచంద్‌కు వికారాబాద్ వచ్చిన సందర్భాలను గుర్తుచేసుకుంటున్నారు.



పాట పాడుతున్న సాయిచంద్ (ఫైల్)

‘తల్లడిల్లుతున్న తల్లి’కి చేయూత

- కురుమ సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం
- ప్రతినెలా రూ.2 వేలు అందజేత
- సదరం సర్టిఫికెట్, పెన్షన్ కోసం కృషి చేస్తానన్న ఎమ్మెల్యే



భారతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కురుమ సంఘం ప్రతినిధులు

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు రూరల్: దివ్యాంగులైన ఇద్దరు పిల్లలతో ‘తల్లడిల్లుతున్న తల్లి’ ‘సాక్షి’ కథనానికి జిల్లా కురుమ సంఘం ప్రతినిధులు స్పందించారు. గురువారం తాండూరు మండలం ఓగిపూర్ గ్రామానికి వెళ్లి కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు నాగారం జగదీష్‌ల తదితరులు ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అంద జేశారు. పెన్షన్ వచ్చేదాక ప్రతి నెల ఆ కుటుంబానికి రూ.2 వేలు సహాయం అందజేస్తామని సంఘం ప్రతిని ధులు తెలిపారు. అంగవైకల్యం ఉన్న అర్చన, మల్లేశంలకు కూడా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తామని డాక్టర్ నాగారం లావణ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు పూజారి పాండు, ఇందూరు మల్లేశం,పల్లె వెంకటయ్య,కౌన్సిలర్ బాలప్ప, వీరేశం, మల్లేశం, బీరప్ప, నర్సింహులు, గుండప్ప, దస్తప్ప, బాలప్పలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భరోసా

అంగవైకల్యంతో బాధపడుతున్న అర్చన, మల్లేశంలకు సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు తెలిపారు. సదరం సర్టిఫికెట్ వచ్చిన వెంటనే పెన్షన్ వచ్చేవిధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



కొడంగల్‌లో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు



తాండూరు పట్టణంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి..

కొడంగల్ : పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని శ్రీవారి ఆలయంలో ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయంలోని అభిషేక మండపంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆధ్యాత్మిక ధార్మిక సేవా సంస్థ సభ్యులు విష్ణు సహస్ర పారాయణం వినిపించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి..

తాండూరు టౌన్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాండురంగ దేవాలయంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండి ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్థిల్లాలని భగవంతున్ని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సమాజసేవలో మేము సైతం..



వైద్య సిబ్బందితో యువ 24ఫౌండేషన్ సభ్యులు

యువతకు స్ఫూర్తి యువ 24ఫౌండేషన్

కొడంగల్ రూరల్ : సమాజసేవలో మేము సైతం అంటూ యువ 24 ఫౌండేషన్ సభ్యులు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విద్య, వైద్య రంగాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2021వ ఏడాదిలో ఆస్పత్రిలో బ్లడ్ లేదనే విషయం తెలుసుకొని స్నేహితులు రక్తదానం చేశారు. ఈ క్రమంలో మండల పరిధిలోని రావులపల్లి గ్రామంతోపాటు పరిసర గ్రామాల యువకులు సురేశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్, కృష్ణ యాదవ్, మల్లేష్‌యాదవ్, బుట్ట అశోక్, రవి గౌడ్, సర్పంచు మాటూర్ వెంకట్, రామయ్యగౌడ్, కలారి రమేష్, మహమూద్, మహేష్‌గౌడ్‌లు యువ 24ఫౌండేషన్ ఏర్పాటుచేశారు. యువతకు అవగాహన కల్పిస్తూ రక్తదాన శిబిరాలతో రక్తం అందించవచ్చనే ఆలోచనతో యువ 24ఫౌండేషన్‌ను నెలకొల్పామని సభ్యులు తెలిపారు. మొదటి సారిగా 2022 మే 21న రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో సుమారు 43మంది రక్తదానం చేశారు. రెండోసారి 2023మార్చి 19న నిర్వహించిన రక్తదాన శిబిరంలో 103 మంది రక్తదానం చేశారు. ఇటీవల ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని 52యూనిట్ల రక్తం సేకరించారు. ఇందుగాను తాండూరు, వికారాబాద్ ఆస్పత్రుల వైద్య సిబ్బంది సైతం యువ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ ఫౌండేషన్ సభ్యులకు ప్రశంసాపత్రాలు సైతం అందించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శమని పేర్కొంటున్నారు. ఆరోగ్యవంతులైన 18ఏళ్ల పైబడిన వ్యక్తులు రక్తదానం చేయడం ఎంతో శ్రేయస్కరమని సభ్యులు పేర్కొంటున్నారు. అలాగే ఫౌండేషన్ సభ్యులు విద్యాభివృద్ధికి కూడా కృషిచేస్తున్నారు.



రక్తదాన శిబిరంలో యువకులు (ఫైల్)

కారులో నిద్రిస్తూనే..

వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్ : కారులో నిద్రిస్తున్న ఓ వ్యక్తి ప్రాణాలు వదిలిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తారమతిపేట గ్రామ గౌడ సంఘం శ్మశాన వాటిక పక్కనే నిలిపి ఉన్న కారులో ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు గురువారం పోలీసులు కారు తలుపులు తెరిచి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో మృతుడి వివరాల కోసం ఆరా తీయగా నాగర్ కర్నూలు జిల్లా ఉప్పునూతల మండలం మామిళ్లపల్లికి చెందిన కడారి కృష్ణ (30)గా గుర్తించారు. నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం తారమతిపేట గ్రామానికి భార్య, ముగ్గురు పిల్లలతో వచ్చిన కృష్ణ తన సోదరుడికి చెందిన కారును అద్దెకు నడుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కృష్ణ మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, బుధవారం రాత్రి ఇంటికి కూడా రాలేదని మృతుడి భార్య తెలిపారు. అనారోగ్యం కారణంగానే తన భర్త మృతి చెంది ఉండవచ్చని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

పరిగి: విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పాండురంగాచారి అన్నారు. గురువారం పట్టణకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వచ్చే నెలలో నిర్వహించే రాష్ట్ర సభ్యసభ్య సన్నాహక సమావేశానికి సంబంధించి కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూలై 9న నగరంలోని సీతాఫల్‌మండి వద్ద మల్టీపర్పస్ గార్డెన్‌లో రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘ సభ్యులు విధిగా హాజరు కావాలన్నారు. అందరూ కలసి కట్టుగా ఉంటేనే మన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వెంకటచారి, మాతృ సంఘం జిల్లా కన్వీనర్ కవిత, అశోక్, శ్రీనివాస్, కృష్ణమాచారి, గోపాల్,గంగాధర్, బ్రహ్మం, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



బడేంపల్లిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

దోమ: కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని కొండాయపల్లి, బడేంపల్లి గ్రామాల్లో ఇటీవలే రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ కార్యకర్తలు మృతి చెందారు. ఈ మేరకు ఆయన మండల కాంగ్రెస్ నేతలతో కలసి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రతి కార్యకర్త కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, తాలూకా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగవర్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-సిటీ సిగలో కొత్త నగ

రాబోతున్న మరో దిగ్గజ కంపెనీ
- రూ.225 కోట్ల పెట్టుబడితో టీసీఎల్
- నెలకొల్పనున్న కొత్త యూనిట్
- 500 మందికి ఉపాధి అవకాశాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇప్పటికే పలు దిగ్గజ కంపెనీలు కొలువు దీరిన ఈ -సిటీ సిగలో మరో కొత్త నగ చేరబోతోంది. కన్స్యూమర్ ప్రొడక్ట్ రంగంలో విస్తృత ఉత్పత్తుల శ్రేణి కలిగిన టీసీఎల్ ఎలక్ట్రానిక్స్ సంస్థ రూ.225 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలో కొత్త యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు రెండు రోజుల క్రితం ఆ సంస్థ ప్రతినిధులు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సంస్థతో ప్రత్యక్షంగా 500 మందికి.. పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ సంస్థ తన ప్రధాన కేంద్రమైన చైనాలోని హె ఫెయి నగరం తర్వాత విదేశాల్లో ఏర్పాటు చేస్తున్న తొలి తయారీ యూనిట్ ఇదే కావడం విశేషం. తొలుత వాషింగ్ మిషన్లు తయారు చేసేందుకు ఉద్దేశించిన ఈ తయారీ కేంద్రం త్వరలోనే రిఫ్రిజిరేటర్లు, డిష్ వాషర్లను ఉత్పత్తి చేయనుంది. ఇప్పటికే కొంగర వేదికగా రూ.3,500 కోట్ల పెట్టుబడితో 196 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కాబోతున్న ఫాక్స్‌కాన్ కంపెనీతో రావిర్యాల సహా ఆ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.

పెట్టుబడుల వెల్లువ

ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చింది. పెట్టు బడిదారులను ఆకర్షించేందుకు పలు రాయితీలను ప్రకటించింది. తక్కువ ధరకే భూములు కేటాయించడంతో పాటు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా, సత్వర అనుమతుల జారీ కోసం టీఎస్ ఐపాస్‌ను ప్రవేశపెట్టింది. 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 మార్చి వరకు 1,589 దరఖాస్తులు టీఎస్ ఐపాస్‌కు అందగా, వీటిలో ఇప్పటి వరకు 1,171 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. రూ. 77,320 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టాలనే లక్ష్యంతో ఆయా కంపెనీలు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు రూ.44,572. 88 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. 9,67,297 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యం కాగా, 4,88,472 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయి.

ప్రముఖ కంపెనీలన్నీ ఆ చుట్టు పక్కలే..

ప్రభుత్వం గుర్తించిన ఉత్తమ పరిశ్రమలన్నీ దీనికి సమీపంలోనే ఉన్నాయి. ఆదిబట్ల సెజ్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం కంపెనీ 2000 మందికి ఉపాధి కల్పనలో మొదటి స్థానంలో నిలిచింది. విప్రో పర్సనల్ కేర్ లిమిటెడ్ కంపెనీ 600 మంది స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. రాధా రమణ ఎంప్లాయర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ (టీఐడీఈఏ) ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌లో మొదటి స్థానంలో నిలిచిన కంపెనీ కూడా దీనికి సమీపంలోనే ఉంది. మహేశ్వరంలోని హార్డ్ వేర్ పార్క్‌లోని ఎం- ప్యాడ్ ఇంజనీరింగ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ సహా నాదర్‌గుల్‌లోని లార్డ్‌వెన్ హాంగర్స్ కంపెనీలు కూడా ఇక్కడే ఉండటం గమనార్హం. భగవతి ప్రొడక్ట్స్ సహా రూ. 200 కోట్ల పెట్టుబడితో రెనివేస్ సోలార్ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్, రూ.334 కోట్లతో ప్రీమియర్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్, రూ.20 కోట్లతో రిడెంట్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు సమీపంలోనే ఉన్నాయి.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ : దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లిలో సంజీవ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డితో కలసి భూమి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందన్నారు. సంజీవ స్వామి దేవాలయాన్ని త్వరితగతిన నిర్మించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. ప్రజలు దైవభక్తిని అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, సర్పంచ్ అశోక్‌రెడ్డి, పూజారి సిద్ధాంతిప్రార్థసారథి, బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

గ్రామానికి చెందిన అనిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సీఎం సహాయ నిధి కింద బాధిత మహిళకు రూ. లక్ష మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందించారు.



సంజీవ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు